ప్రతిమానాటకము

భాసకృతికి తెనుఁగు

కర్త

వేటూరి ప్రభాకరశాస్త్రి

ద్వితీయ ముద్రణము

వెల ౧-౦-౦]   [౧౯౩౪

చెన్నపురి :
ఆంధ్రపత్రికా ముద్రాలయమున
ముద్రితము

తొలి పలుకు

ఇప్పటి కించుమించుగాఁ బదునేడేండ్లకుఁ బూర్వము నే నీనాటకమును దెలిఁగించితిని. మన్మిత్రులు బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రప్పుడు తిరువనంతపురమునందుఁ గార్యాంతరమునఁ గొన్ని మాసములు వసించి భాసనాటకములఁ గొన్నింటి నక్కడనుండి వ్రాసికొనివచ్చిరి. అప్పటి కింకను దిరువనంతపుర గ్రంథమాలలో నా నాటకములు ముద్రితములు గాలేదు. ఆవ్రాఁతప్రతులనుబట్టియే కవిగారు గొన్ని నాటకములను దెలిఁగించిరి. నేను గొన్నింటిని దెలిఁగించితిని. పెద్దదగు నీ ప్రతిమానాటకమును నే నప్పుడు ముద్రింపఁ జాలనయితిని. తరువాతఁ దిరువనంతపురరాజకీయసంస్కృతగ్రంథమాలాసంపాదకులగు శ్రీగణపతిశాస్త్రిగా రీ ప్రతిమానాటకమును రెండుమార్లు ప్రకటించిరి. రెండవతూరి స్వరచిత వ్యాఖ్యాసహితముగాఁ బ్రకటించిరి. నే నిప్పుడు దీనిని బ్రకటించుటలో నా వ్యాఖ్యానముయొక్క తోడ్పాటునుగూడఁ బడసితిని. రెండుమూఁడుచోట్లమాత్ర మా వ్యాఖ్యానరీతిని, పాఠరీతిని విడిచి తొలుత నాకుఁదోఁచిన యర్థమును, నేను జూచినవ్రాఁతప్రతిపాఠమును బాటించితిని. అవియే యనుసరణముగా నున్నవన్న నమ్మిక నాకుఁ గలదు. పెక్కుపట్టుల గణపతిశాస్త్రిగారి వ్యాఖ్య మిక్కిలి చక్కఁగా నున్నది. భాసనాటకము లని

గణపతిశాస్త్రిగారు ప్రకటించిననాటకచక్రము భాసకృతము గా దని యిప్పుడు గొందఱు ఉద్ఘోషించుచున్నారు. కాని యీ యుద్ఘోషములు గణపతిశాస్త్రిగారు చెప్పినకారణముల నెల్ల ఖండింపఁజాలినవిగా లేవు. రామాయణ, భారతకథలనుబట్టి భాసుఁడు రచించిననాటకము లాతఁడు రామాయణ భారత కథలలోని యనౌచిత్యములను సంస్కరించుటకై యభిమానించి రచించినాఁడేమో యనఁదగిన ట్లున్నవి. ప్రస్తుతమయిన యీ ప్రతిమానాటకమునం దట్టిసంస్కారములను బరికింపఁదగును కైకేయీవృత్తమును, సీతావృత్తమును నిందుఁ జక్కఁగా స పఱుపఁబడినవి. కైకేయికి దుర్బుద్ధి యీ నాటకరీతిని గా రాదు. సీత హిరణ్యమృగమును గోరుటగాని, లక్ష్మణు నవాచ్యవచనము లాడుటగాని యిందుఁ గానరాదు. పంచమ షష్ఠాంకములను జూచినచో నీవిషయము తేటపడును.

ప్రథమాంకమున వల్కలకల్పనము, తృతీయాంకము దశరథప్రతిమాకల్పనము, పంచమాంకమున దశరథశ్రాద్ధకల్పనము నిందు సరిక్రొత్తవిషయములు. ఇవి మిక్కిలి సర ములై, సంగతము లై యున్నవి. ప్రతిమానాటకరచనలు గొన్ని శాకుంతలనాటకరచనలో ననుకరింపఁబడినవి. తృతీయాం మున రథవేగవర్ణనము, పంచమాంకమున "కసుగందున్ ఇత్యాదిసీతావనస్థితివర్ణనము, కాళిదాసుని శాకుంతల రథవే వర్ణనమును, 'సరసిజ మనువిద్ధ' మిత్యాదిశకుంతలావనస్థితివర్ణ మును జూడఁదగును. సీత చెట్లకు నీళ్లు పోయుచుండుట

వర్ణించు "సీ. ఆలవాలముల నిండార నుదువ్వలువాజీ" అను పద్యము (పంచమాంకము) స్వభావోక్తి సౌభాగ్యముచే నెంత యు హృద్యముగా నున్నది.

సప్రయోజనముగా జరపినసంస్కారములుగాక వాల్మీకి రామాయణకథకును, ఈనాటకకథకును భేదములు గొన్ని గాన వచ్చుచున్నవి. అట్టి దొక్కటి: ఇందు లక్ష్మణుఁడు పెద్ద వాఁడుగాను, భరతుఁడు చిన్నవాఁడుగాను గానవచ్చును. లక్ష్మ ణుఁడు భరతుని 'వత్స!' యని పిలుచును; ఆశీర్వదించును. భరతుఁడు లక్ష్మణునకు మ్రొక్కును; 'ఆర్య!' యని పిలు చును. ఈ విషయము వాల్మీకిరామాయణమున సంశయగ్రస్త ముగా నున్నది. బాలకాండలో:—"పుష్యే జాతస్తు భరతః— సార్పే జాతౌ తు సౌమిత్రీ—" అని కలదు. భరతుఁడు పుష్య నక్షత్రమునను, లక్ష్మణశత్రుఘ్ను లాశ్లేషానక్షత్రమునను జన్మిం చిరి: కాన భరతుఁడే జ్యేష్ఠుఁ డగును. కాని, దీనికి విరుద్ధ ముగా లక్ష్మణుఁడే జ్యేష్ఠుఁ డగు ననుటకుఁగూడ సాధనములు గొన్ని రామాయణమునందుఁ గలవు. యుద్ధకాండమున ౧౩౦-వ సర్గము ౩౯-వ శ్లోకము:—

"తతో లక్ష్మణ మాసాద్య వైదేహీం చాభ్యవాదయత్,
అభివాద్య తతః ప్రీతో భరతో నామ చాఽబ్రవీత్"

అని కలదు. సరళరీతిని జూడఁగా నిక్కడ భరతుఁడు లక్ష్మ ణుని, సీతను నమస్కరించిన ట్లర్థ మేర్పడును. ఇట్లు చెప్పి

ననే 'వైదేహీంచ' యనుట సమర్థమగును. జన్మకాలమునుబట్టి భరతజ్యైష్ఠ్యము ప్రవ్యక్తమగుచుండుటచే రామాయణవ్యాఖ్యాతలిక్కడ చిక్కుపడిరి. గోవిందరాజు "లక్ష్మణమాసాద్య = కృతనమస్కారం లక్ష్మణ మాలింగనేన సంభావ్య, ఇదంచ లక్ష్మణస్య కనిష్ఠత్వాత్, లక్ష్మణేన చికీర్షితో నమస్కారో రామసన్నిధౌ భరతేన ప్రతిషేధిత ఇతి చాహుః. వైదేహీం చాభ్యవాదయత్ - చకారో రామనమస్కారం సముచ్చినోతి." అని వ్రాసెను. మఱియు నీతఁడు "సీతామాదాయ గచ్ఛత్వమగ్రతో భరతాగ్రజ" అని స్థలాంతరమునఁగల వాల్మీకిరామాయణప్రయోగము సరళరీతిని లక్ష్మణజ్యైష్ఠ్యమును జెప్పుచున్నను, జన్మకాలరీతికి విరుద్ధమగుటచే, 'భరతాగ్రజ ఇత్యత్ర బహువ్రీహి రిత్యుక్తమ్' అని క్లిష్టార్థము గల్పించెను. 'స సంఖ్యే భరతానుజః' అని యింకొకచో భరతజ్యైష్ఠ్యవ్యంజకప్రయోగమును గలదని గోవిందరాజు పేర్కొనెను. తిలకవ్యాఖ్యానమున 'తతో లక్ష్మణ మాసాద్య' యను శ్లోకమున లక్ష్మణునకు భరతుఁడు నమస్కరించినట్లే యర్థము చెప్పఁబడినది. కాని, దాని నాతఁడు వేఱువిధమున సమర్థింపఁబోయెను:—'యద్యపి లక్ష్మణో భరతాత్కనిష్ఠో వయసా—స్పష్టం చేదం జన్మప్రకరణే. తథాఽపి జ్యేష్ఠానువర్తనేన స్వాపేక్షయా అధికగుణత్వేన స్వవ్యవహారేణ జ్యేష్ఠానువృత్తి రేవం కర్తవ్యేతి భరతంప్రతి ఉపదేశదానేనచ గురుత్వబుద్ధ్యా తస్య నతి రుచితైవ'. ఇది వైష్ణవసంప్రదాయరీతి నున్నది—పాయస

ప్రదానమునుబట్టి, వివాహక్రమమునుబట్టి లక్ష్మణునకే జ్యైష్ఠ్యము గాననగును. గోవిందరాజు దీనిని పేర్కొని యది జన్మకాలరీతిచేఁ బరిష్కృత మయ్యె ననెను. భవభూతి భరతజ్యైష్ఠ్యమునే పాటించెను. అర్వాచీనులు పలువురు భరతజ్యైష్ఠ్యమునే యభిమానించినను, ప్రాచీనుఁ డగు భాసునినాఁట లక్ష్మణజ్యైష్ఠ్యమే లక్షిత మైనట్టీనాటకమునుబట్టి తెలియనగును. లక్ష్మణజ్యైష్ఠ్యము వాల్మీకిసమ్మతము గా దని కూడ స్పష్టముగాఁ జెప్పఁజాలము.

భరతునివృత్త మిందుఁ బరమోత్తమముగాఁ గాపాడఁ బడినది. వాల్మీకులవారుగూడ భరతునివృత్తమును గడుపవిత్రముగఁ జిత్రించిరి. ఈనాటకమున భరతోక్తి యిది యెంతయు హృద్యము !—

“శా. పాపాత్ముం డగునేని.........దీఱుతన్”

(తృతీయాంకము)

‘కొడుకు దుష్టుఁడేని ఘటశ్రాద్ధము చేసి వాని కపుత్త్రిత్వమును గల్పింపవచ్చును. వానికి దాయ మీయ నక్కఱలేదు. వానితో నాశౌచాదిసంబంధ ముండదు. కాని, తల్లి యెంత దుష్టురాలైనను, ఆమెమాతృత్వముమాత్రము తొలఁగదు.’ అని ధర్మశాస్త్రనిర్ణయము గలదు. ఇతరదోషము లున్నను మాతృత్వము తొలఁగకపోవచ్చును గాని, యామె భర్తృద్రోహము చేయునేని యప్పుడు మాతృత్వము తప్పక తీఱిపోవలసినదే

యని యీ ధర్మశాస్త్రమును భరతుఁడు సంస్కరించు ననుట హృద్యాతిహృద్యము! ఇట్టివిషయము లనేకము లిందుఁ గలవు. సరసులు గుర్తింపఁగలరు.

బహుకాలమునకు ముందే రచించినను మూలఁ బడవైచిన యీనాటకమును మన్మిత్రులు, విద్వాంసులు, వినీతులు నగు శ్రీ జయంతిపురము జమీాందారుగారు వాసిరెడ్డి శ్రీ దుర్గాసదాశివేశ్వరప్రసాద బహద్దరుగారు, ముద్రింపఁ బ్రోత్సాహపఱిచిరి. వారిచేఁ బ్రోత్సాహితుఁడను గానిచో నే నిప్పుడు దీనిని ముద్రింపఁబూనను. ప్రకటనమునకు బహురచనములు పయిపయి వచ్చుచున్నను, అప్రౌఢకృత మయినను నాయీనాటకము నందుకొని ప్రకటించిన భారతీపత్రికాధిపతులసాహాయ్యమును బ్రశంసించుచున్నాఁడను. మధురకవితారచనాప్రథితులగు బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులుగారు గూడ నీనాటకమును దెలిఁగించినట్టును, బ్రకటించినట్టును వింటిని. కాని దాని నే నింతవఱకును జూడలేను. గుణదోషవివేచనమునకు సహృదయులు ప్రమాణము.

మదరాసు
౨౮-౧౧-౨౭

వేటూరి-ప్రభాకరశాస్త్రి

ప్రతిమానాటకము

[నాంది యయినతర్వాత సూత్రధారుఁడు ప్రవేశించును.]

సూత్రధారుఁడు—

గీ. సీత చెలికాఁడు లక్ష్మణాశ్రితుఁడు భరత
హితుఁడు సుగ్రీవరాముఁ డప్రతిమమతి సు
మంత్రనుతుఁడు విభీషణాత్మకుఁడు రావ
ణారి యగుశౌరి మీకు శ్రేయము లొసంగు.

(తెరవంకఁ జూచి)

ఆర్యా! ఇటు రమ్ము.

నటి— (ప్రవేశించి)ఇదిగోనండీ వచ్చినాను.

సూత్ర—ఏదీ! ఈ శరత్కాలమునుగూర్చి ఒక్కపాట పాడుము.

నటి—ఆలాగేనండీ! పాడుతున్నాను.

(పాడును.)

సూత్ర—ఈకాలమున-

గీ. సైకతములందుఁ గాశవస్త్రములఁ దాల్చి
యంచచెలి మైమయిని నడయాడుచుండు—

(తెరలో)

అయ్యా! అయ్యా!

సూత్ర—(విని) సరి; తెలిసినది.

ప్రమదము దలిర్ప రాజసౌధమునయందు
నాత్రమున వర్తిలెడు ప్రతీహారివోలె.

[నిష్క్రమించిరి.]

ఇది స్థాపన

ప్రతీహారి—(ప్రవేశించి) అయ్యా! కాంచుకీయులలో ఎవరూ ఇక్కడ ఉన్నవారు?

కాంచుకీయుఁడు—(ప్రవేశించి) అమ్మా! ఇదిగో నేనున్నాను. ఏమి చేయవలెను?

ప్రతీ—అయ్యా! దేవరాక్షసయుద్ధములలో అప్రతిహతమహారథు లయి గెలుపొందినవారు దశరథమహారాజులుంగారు ఈవిధంగా ఆజ్ఞాపిస్తు

న్నారు: "చిరంజీవి శ్రీరామచంద్రునికి రాజ్య ప్రాభవము సంక్రమింపఁజేయుటకు అభిషేకసంభార ములు శీఘ్రముగా ఆయత్తపఱచవలసినది" అని.

కాంచుకీ—అమ్మా! మహారాజులుం గారు సెలవు దయచేయించినట్లు సర్వము సంసిద్ధపఱుచు టయినది. అవిగో చూడు—

సీ. పటహాదివాద్యముల్ పరికలితము లయ్యె
వందివర్గము చేరవచ్చి యుండె
హాస్తికచ్ఛత్రచామరము లాత్తము లయ్యె
భద్రాసనము సిద్ధపఱుపఁబడియె
సౌవర్ణకలశముల్ సమకూర్పఁబడెఁ దీర్థ
వారితోఁ గుశపుష్పపూరితముగ
రక్షింపఁబడెఁ బుష్యరథము మంత్రులతోడఁ
బౌరు లారంగూరి పాఱుతెంచి
రింత కెల్లమంగళ మయి సంతరించు
నంచితుఁడు వేదమూర్తి మహామహుండు
విధివిధానము లెల్ల నిర్విఘ్నపఱిచి
వెలయుచున్నాఁడు వేదిపై నలువకోడుకు.

ప్రతీ—ఆలాగా! సరి! చక్కఁగా సమకూర్చినారు.

కాంచుకీ—ఆహా! మేలుగదా!

ఆ. జగతియందు రామచంద్రుఁ డక్క చంద్రుని
కఖిల రాజ్యపట్ట మప్పగించి
యిపుడు భూమిప్రజలఁ గృతకృత్యులను జేసె
దశరథేశ్వరుండు తానుఁ దనిసె.

ప్రతీ—అయ్యా! త్వరపడు! త్వరపడు!

కాంచుకీ—అమ్మా! ఇదిగో నేను తొందరతోనే ఉన్నాను. (అని నిష్క్రమించును.)

ప్రతీ—(పరిక్రమించి చూచి) అయ్యా! సంభవకా! సంభవక! వెళ్లు, నీవుకూడా మహారాజులుంగారి సెలవైందని పూజ్యులయిన పురోహితుల వారిని తొందరపెట్టు. మర్యాదతో మాటాడు సుమా వారితో! (ప్రక్క కరిగి) సారసికా! సారసికా! సంగీతశాలకు పోయి నాటకులకు విన్నవించు—'సమయానుగుణమైన నాటక మాడడానికి సన్నద్ధులు గావలసిన' దని. ఇదుగో నేనూ వెళ్లి

సర్వము సమకూర్చుడమైన దని మహారాజులుంగారితో మనవి చేసుకుంటాను. (నిష్క్రమించెను.)

(అంత అవదాతిక నారచీర గొనివచ్చును.)

అవదాతిక—అయ్యో! ఎంత తంటాగా ఉంది! నవ్వటాలకు నారచీర ఎత్తుకువస్తేనే నాకు ఇట్లా ఉందే! దురాశతో పరధనము దొంగిలించుకు వస్తారే, వాళ్లకు ఇంకా ఎట్లా వుంటుందో! నవ్వు తెచ్చుకుందా మనుకుంటాను. ఒక్కర్తెను ఎట్లా నవ్వేది?

(అంత సీత సపరివారయై ప్రవేశించును.)

సీత—(చెలితో) ఓసీ! అవదాతికముఖ మేమో వెలవెలపోతున్నట్టున్నది, ఎందుచేతనో కదా!

చేటి—అమ్మా! పరిచారిక లంటే ఆతప్పూ ఈతప్పూ చేస్తూఉంటారు గదా! ఇప్పు డేదో తప్పు చేసిఉంటుంది.

సీత—కాదుకాదు. నవ్వు తెచ్చుకోవలె నని చూస్తున్నట్టున్నది.

అవదాతిక—(చేరఁబోయి) రండి, అమ్మగారూ! రండి. నేను తప్పు చేయలేదు సుమండీ; నే నేమీ తప్పు చేయలేదు.

సీత—ఎవరు ని న్నడిగినారు, అవదాతికా! ఏమిటే అది? ఎడమచేతిలో ఏమిటో ఉంచుకున్నావు?

అవదాతిక—అమ్మగారు! ఇది నారచీరండి!

సీత—నారచీర నెక్కడనుంచి తెచ్చినావే?

అవ—అమ్మగారు! వినండి చెప్పుతున్నాను. ఆమెనండి - నాటకరంగాలంకారాలు జాగ్రతపరుస్తుందే ఆమెను, రేవమ్మగారిని - 'పనితీరిపోయినవి అశోకపుచిగురుటాకులు ఉంటేను నాకి' మ్మని అడిగినానండీ. అడిగితేను, 'వల్లకా' దన్నది. అందుకని ఆమెగారిపని పట్టించడంకోసం అక్కడనుంచి ఇది తీసుకువచ్చాను.

సీత—తప్పుపని చేసినావు; పో ఇచ్చిరా.

అవ—అమ్మగారూ! నవ్వులాటలకు గాదండీ దీనిని నేను తీసుకువచ్చింది?

సీత—వెఱ్ఱిదానా! ఇట్లాగే తప్పులు పెరుగు తవి; వెళ్లు, ఇచ్చివేయి; ఇచ్చివేయి.

అవ—చిత్తం, అమ్మగారూ! ఇచ్చివేస్తాను.

(నారచీరను బయలుగాఁ బట్టుకొని వెళ్లుచుండును.)

సీత—ఓసీ! ఇట్లా రా!

అవదాతిక—అమ్మగారు! ఇదిగో వచ్చాను.

సీత—ఓసీ! ఏమే, ఇది నేను కట్టుకుంటే బాగుంటుందా?

అవ—అమ్మగారు! చక్కనివారి కన్నీ చక్కగానే ఉంటవిగాదండీ? మీరు కట్టుకు చూడండి!

సీత—ఐతే ఇటు తే. (తాల్చి) ఓసీ! చూడు! ఇప్పుడు బాగుందా?

అవదాతిక—మీకు బాగుందండీ! నార చీరయినా పమిడిచీరలా గుంది.

సీత—(చేటితో) ఓ! ఏమే, నీ వేమీ మాటాడవు?

చేటి—మాటలతోటి యెందుకు? ఇవిగో ఒళ్లంతా గగుర్పులు చెప్పుతున్నవి; చూడండి.

(గగుర్పులు చూపును.)

సీత—ఓసీ! అద్దమిట్లా తీసుకురా!

చేటి—చిత్తము. (తెచ్చును) అమ్మా! ఇదిగో అద్దము.

సీత—(చేటీముఖము చూచి) ఉండనీ అద్దము. నీ వేమో చెప్పదలచుకొన్న ట్టున్నావు.

చేటి—అమ్మగారూ! నే నిట్లా విన్నాను. కంచుకి బాలాకయ్యగారు 'అభిషేకము, అభిషేకము' అని అంటున్నారు.

సీత—ఎవరో రాజ్యాభిషిక్తు లవుతారు. (ఇంకొక చేటి వచ్చి)

చేటి—అమ్మగారు! శుభవర్తమానం, శుభవర్తమానం.

సీత—ఏమి టేమిటే; బులపాటంతో అంటున్నావు!

చేటి—బాబుగారికి అభిషేకము గాదండీ!

సీత—తండ్రిగారు క్షేమముగా ఉన్నారా?

చేటి—మహారాజులుంగారే పట్టం గట్టుతున్నారు.

సీత—అయితే రెండుశుభవార్తలు విన్నాను. బాగా పెద్దగా ఒడిపట్టు.

చేటి—ఆహా! (అట్లు చేయును.)

(సీత నగల నూడదీసి యిచ్చును.)

చేటి—అమ్మగారూ! నగారా మోతలాగున్నది.

సీత—అదే.

చేటి—ఒక్కసారిగట్టిగా కణకణ వాయించి మరి ఊరుకున్నారేమి చెపుమా?

సీత—ఏదయినా అడ్డంకి వచ్చిందేమో అభిషేకానికి? ఏమంటే, రాజస్థానములు బహు గడబిడలతో ఉంటవాయెను.

చేటి—అమ్మగారు! నే నిట్లా విన్నాను. బాబుగారికి పట్టముగట్టి మహారాజులుంగారు అడవికి వెళ్లుతారట.

సీత—అయితే ఆడదకము రాజ్యాభిషేకము కోసముకాదు. కన్నీటిముఖము కడుగుకొనడముకే.

(అంత రాముఁడు ప్రవేశించును.)

రాముఁడు—అన్నా!

సీ. పటహప్రణాదముల్ ప్రారంభ మయ్యెను
కూర్చుండి రేతెంచి గురుజనులును
భాసురం బైన భద్రాసనంబునయందు
నధివసించితి నేను విధిహితముగ
తల యొగ్గితి సువర్ణకలశంబుల జలంబుఁ
గ్రుమ్మరింపఁగ నెత్తికొనిరి మఱియు
నన్ను నాహ్వానించి నరనాథుఁ డంతలో
నట వీడి చను మని యాన తిచ్చె
విడిచి యట్టె నేను వెడలితిఁ బ్రజ లట్టి
ధైర్యమునకు నద్భుతంబు గనిరి
వింత యేమి యిందు సంతాన మిలయందుఁ
గన్నతండ్రిమాట విన్నచోట!

'నాయనా! నీ విప్పుడు విశ్రమింపు'మని రాజుగారు నన్ను వీడుపుచ్చఁగాఁ దలబరువు దీఱినట్లు, తెప్పిఱిల్లినట్లు, నామదికిఁ దోఁచినది. నేను వెను

కటి రామచంద్రుఁడనుగానే, మహారాజుగారు మహారాజుగారుగానే ఉండుట మంచిది. ఇదిగో ఇప్పుడు మైథిలిని జూచెదను.

అవదాతిక — అమ్మగారూ! రాజకుమారులుంగారు వస్తున్నారు. నారచీరను విడవలేదు మీరు!

రాముఁడు — మైథిలీ! ఏమి చేయుచుంటివి?

సీత — ఏమి! ఆర్యపుత్త్రులా! (చూచి) జయము ఆర్యపుత్త్రులకు.

రాముఁడు — మైథిలీ! కూరుచుండుము.

(కూరుచుండును)

సీత — చిత్తము. సెలవుప్రకారము.

(కూరుచుండును)

అవదాతిక — అమ్మగారూ! రాజకుమారులుంగారు మునుపటివేషముతోనే ఉన్నారు. మన మనుకొన్నది అబద్ధమువలె ఉంది.

సీత — అటువంటివారు అబద్ధమాడరు. ఐనా రాజస్థానములు ఎన్నో గడబిడలతో ఉంటవి.

రాము—మైథిలీ! ఏమి టది? ఏమో మాటాడుచున్నావు?

సీత—ఏమీ లేదు. ఈపిల్ల అంటున్నది "అభిషేకము అభిషేకము" అని.

రాము—నీ కుతూహలము తెలిసికొన్నాను. అగును; అభిషేకప్రయత్నము జరగకపోలేదు. వినుము: ఇప్పుడు మహారాజుగారు ఉపాధ్యాయామాత్య ప్రకృతిజనసమక్షమున నన్ను బాల్యాభ్యస్త మయినయంకమునఁ గూర్చుండఁబెట్టుకొని కోసలరాజ్యము నొకయేల్బడి క్రిందికిఁ దెచ్చి "నాయనా! రామచంద్రా! నీతల్లికడుపు చల్లఁగా నీవు రాజ్యమును గ్రహింపుమా" యనిరి.

సీత—అప్పుడు మీ రేమి పలికితిరి?

రాముఁడు—మైథిలీ! నే నేమి పలికియుందు నని నీ వనుకొనెదవు.

సీత—ఆర్యపుత్త్రు లప్పుడు బదులు పలుకక నిట్టూర్పు విడిచి మహారాజులుంగారిపాదములపైని పడిఉంటా రని నే ననుకొంటాను.

రాము—సరిగా నూహించితివి. తుల్యశీలు రగుదంపతులను బ్రహ్మ సత్కృత్తుగా సమకూర్చు చుండును. అట్లే అప్పుడు పాదములపైఁ బడితిని.

గీ. మీఁదఁ బడు తండ్రిగారిబాష్పోదకమునఁ
గ్రిందఁ బడు నాదుబాష్పవార్బిందువులను
సమముగాఁ దండ్రిగారిపాదములతోడఁ
దడిసె నప్పుడు నాదుమస్తకముగూడ.

సీత—అటుతర్వాత ?

రాముఁడు—అటుతర్వాత వారియన్నట్టి వాక్యములకు నే నంగీకరింపకపోఁగా, వారు జరాదోషము సమీపించిన తమప్రాణములమీఁదను బట్టు పెట్టినారు.

సీత—ఆపైని ?

రాముఁడు—ఆపై నప్పుడు—

గీ. తోడరి యభిషేకఘటము శత్రుఘ్న లక్ష్మ
ణులు గొనిరి; గొడ్డు టేఁడు రోదిలుచుఁ గొ
ద్రొట్టిలుచు జేని చెవిలో నేదో వచించె [నియోఁ;
నంత మంథర; రాజు గానైతి నేను.

సీత—నాకు చాలాసంతోషము. మహారాజు లుంగారు మహారాజులుంగారే; ఆర్యపుత్త్రులు ఆర్యపుత్త్రులే.

రాము—మైథిలీ! అలంకారములను దీసి యుంటి వేల?

సీత—నేను పెట్టుకొననేలేదుగదా!

రాము—కాదు. ఇప్పుడే నీవు నగల నూడఁ దీసియుందువు.

చ. ఒరసెను గమ్మదోయి వడి
నూడ్చుకతంబునఁ గర్ణరంధ్రముల్,
గరములఁ దెల్పు గన్పడెడుఁ
గంకణముల్ వదలించుటన్, మెయిన్
బరువయియున్న పెన్నగల
పట్టునఁ దొట్టినయొత్తు లిత్తఱిన్
విరియకయున్న, వోయువిద!
వీడితి విప్పుడె భూషణావళుల్.

సీత—ఆర్యపుత్త్రులు అబద్ధముకూడా సత్యమువలె సందర్భింపజేసి చెప్పగలరు.

రాముఁడు—అవును లెమ్ము. ఇంక నలంకరించుకొమ్ము. నే నద్దము పట్టుకొందును. (అట్లుచేసి నిర్వర్ణించి) నిలుము.

గీ. అద్దమున నారచీరలయట్లు దోఁచె
సూర్యకిరణంబులా యివి సుదతి! కావు.
నవ్వుచేత నూహించితి, నివ్విధమున
వేడుకకుఁ దాల్చితివొ వ్రతవిధికొ చెపుమ!

అవదాతికా! ఏమి యిది?

అవదాతిక—దేవా! ఏమో బాగుంటుందో బాగుండదో చూదామని ముచ్చటకు కట్టుకొన్నా రమ్మగారు.

రాముఁడు—మైథిలీ! ఏమిది? ఇక్ష్వాకువంశమువారి ముసలితనపు టలంకారమును ధరించితివి? ప్రియమే నాకును; ఇటు తెమ్ము.

సీత—వద్దు వదు. ఆర్యపుత్త్రులు అమంగళము లాడవద్దు.

రాముఁడు—మైథిలీ! ఏల వల దనెదవు?

సీత—అభిషేకము తప్పిపోయిన మీ కిది అమంగళపుమాట అని నాకు తోఁచుచున్నది.

రాముఁడు—

గీ. ముచ్చటకు నన్నదానికై ముద్దరాల,
పెద్దగా సంకటమ్ము గల్పించుకొనకు;
సరి, మఱేమి? నామేనిలో సగమ వీవు
తాల్చితివి; నేను దాల్చుచంద మది గాదె.

(తెరలో) అయ్యో! అయ్యో! మహారాజులుఁగారు!

సీత—ఆర్యపుత్త్రా! ఏమి టది!

రాముఁడు—(విని)

గీ. పూరుషులు స్త్రీలు నటు మితిమీఱి గొల్లు
వెట్టుచున్నా రెదో పెద్దచెట్ట కలిగ
ఎందుకేనియు నేఁ జాలియుందు నంచు
వెల్లడించెను దైవంబు; తెల్ల మయ్యె.

తొందరగా నాగగ్గో లెందుకో కనుఁగొందురుగాక!

కాంచుకీయుఁడు—(ప్రవేశించి) బాబుగారూ! కాపాడుఁడు, కాపాడుఁడు.

రాము —ఆర్యా! ఎవరిని కాపాడవలెను?

కాంచుకీ—మహారాజులుంగారిని.

రాముడు—మహారాజులుంగారినా? ఆర్యా! 'ఒక్క శరీరమం దొదిఁగియున్న యుర్వి నెల్ల' ననికదా యనవలసినది! కాని, ఎవరివలన నేర్పడినది కీడు?

కాంచుకీ—స్వజనమువలన.

రాముఁడు—స్వజనమువలననా? అయ్యో! ప్రతీకారము లేదే!

గీ. బాధ మేనికే కూర్చు విరోధి నైన
నది స్వజన మైన హృదయంబు నదరఁ జేయు
నీ 'స్వజనశబ్ద' మెవ్వరి నేర్పరించి
న న్నిపుడు లజ్జితునిఁ జేయ నున్నదయ్య?

కాంచు— ఎవ్వరి నేర్పరించునా? కైకేయి దేవిగారిని.

రాముఁడు—ఏమి! అమ్మగారినా? అట్లయినచో నదియేదో ఫలోత్తరమయిన మేలే కావలెను.

కాంచు—అది యెటు?

రాముఁడు—వినుఁడు :

ఆ. భర్త యింద్రునంతవాఁడటె మఱియు నా
యట్టివాఁడు పుత్త్రుఁడట్టె యామె;
కేమికామితంబు నిచ్ఛించి తుచ్ఛ మా
చెయ్ద మామె చేయ నెయ్దుకొనును?

కాంచుకీ—బాబూ! చాలును. పాడయిపో యిన యీఁడుబుద్ధులందు మీమంచితనము నుంచఁ బోకుఁడు. ఆమెమాటమీఁదనే కాదా బాబూ, మీయభిషేక మాఁగిపోయినది?

రాము—ఆర్యా! అందు మేళ్లే కలవు కదా!

కాంచుకీ—అది యెట్లు?

రాముఁడు—వినుఁడు :

చ. వనగమనమ్ము భూమిపతి
వర్యున కుండదు, తండ్రిచాటువాఁ
డ నగుదు నేను, దాన నెగ
డంగల దింకను నాకు బాల్యమే,
జనులకుఁ గ్రొత్త యేల్బడివి
చారము తీఱును, నింతకంటె నా

యనుజులు చెందకుందురు మ
హార్హ ధరాధిప భోగవంచనన్.

కాంచుకీ—ఇంకను బయిఁగా పిలువనిపేరం టముగావచ్చి 'భరతునకు రాజ్యాభిషేకము చేయ వలసినది' అన్నది. ఇదికూడ మచ్చరము లేని మంచితలఁపే యందురా బాబూ!

రాము—ఆర్యా! నీవు మామీఁదిపక్షపా తముచే నిజమును గుర్తింపకున్నావు. ఎట్లనఁగా,

ఆ. శుల్కమందు ముందు పల్కంబడిన రాజ్య
మడిగెనేమొ యామె కొడుకుకొఱకు
మచ్చరంబు నెంతు విచ్చోట; తమ్ముల
సిరి హరించు నన్ను నరయవుగద!!

కాంచుకీ—బాబూ! అంతేకాదు. మఱియును,

రాము—ఇఁకమీఁద నమ్మగారిపై నప దూఱు విననొల్లను. మహారాజుగారి వృత్తాంతము మాత్ర మేమో తెలుపుము.

కాంచుకీ—దానిమీఁద నప్పడు—

ఆ. శోకముననువాఁకు రాక, చేసన్నచే
నన్నుఁ బుచ్చె నిటకు; నంతలోనె
యాప్సితమ్ము తనకు నెదియేని కలదేమొ
మూర్ఛలోన తేఁడు మునిఁగినాఁడు.

రాము—ఏమీ! మూర్ఛలో మునిఁగెనా

(తెరలో)

"ఏమీ! మూర్ఛలో మునిఁగెనా" యనెదవా?

ఉ. తాల్పుము విల్లు తేని పరి
తాపము సైఁపనిచో; దయామతిఁ
గొల్పకు

రాముఁడు—(విని యెదుటఁ జూచి)

ఆ. లక్ష్మణుండు ధైర్యలక్షితుం డక్షోభ్యుఁ
డయ్యు నేలా క్షుభితుఁ డయ్యె నిపుడు?
కోపగించి యతఁడు చూపట్టె నాకెట్ట
యెదుటఁ దోఁచె నూర్గు రేమొ యనఁగ.

(అంత విల్లు నమ్ములు పూని లక్ష్మణుఁడు ప్రవేశించును.)

ఉ. తాల్పుము విల్లు తేని పరి
తాపము సైఁపనిచో; దయామతిఁ

గొల్పకు; మిల్లె మెత్తనఁ గ
నుంగొని యొత్తుదు రెందు బందుగుల్;
తెల్పు మనుజ్ఞ; లేకనుమ
తించి ననుక్షమింపు మాఁడుఁ బుర్వ్యాలన్
దుత్పద లోకమం, దిఁక ని
టుల్ పడలేముగదన్న, వంచనల్!

సీత—ఆర్యపుత్త్రా! దుఃఖింపవలసిన సమయములో సౌమిత్రి విల్లెత్తుకొన్నాఁ డేమి? ఎన్నఁడు ఎరగని ఆయాస మిది యేమిటి?

రాముఁడు—సౌమిత్రీ! ఇది యేమి?

లక్ష్మ—ఏమీ! 'ఇది యేమి' యనెదవా?

చ. క్రమముగ సంక్రమింపఁదగు
రాజ్యము నీ కది లేకపోయె, దుః
ఖమున మునింగి భూవిభుఁడు
గద్దియ వీడ్కొని నేలఁ గూలె, నీ
సమయమునందుఁగూడ నిటు
సందియ మందెద వన్న! దీని నే
క్షమగఁ దలంతునా, మనసు
చాలకపోవుటగాఁ దలంతునా?

రాముఁడు—సుమిత్రా పుత్త్రా! నారాజ్యభ్రంశము నీ కింత యుద్వేగమును గలిగించినది. ఎఱుక చాలనివాఁడవుగదా నీవు!

ఆ. నాకొ లేక భరతునకొ రాజ్య మబ్బె, నిం
దెవరి కబ్బె నేమి యేకమ కద!
భుజబలంబు నెఱపి ప్రజఁ బ్రోవఁ జక్క స
హాయపడుము భరతుఁ డగును రాజు.

లక్ష్మణుఁడు—రోషోద్రేకము నణఁచుకొనఁ జాలకున్నాఁడను. కానీ! కానీ! అరిగెదఁగాక!

(వెల్వడును)

రాముఁడు—

ఆ. మూఁడులోకములను ముట్టించి యొకపెట్ట
తగులఁబెట్ట నున్నదానిఁ బోలె
లక్ష్మణన్న కదె! లలాటపుటమ్మును
గ్రమ్మి బొమ్మముడి పొగల్ రగిల్చె.

సుమిత్రాపుత్త్రా! ఇటు రావోయి!

లక్ష్మణుఁడు—అన్నా! ఇదిగో వచ్చితిని.

రాముఁడు—నీమనసు నిబ్బరము చెందుటకై య ట్లంటిని. దీని కిప్పుడు బదులు చెప్పుము.

మ. జనకుఁ సత్యరతుఁ వధించుటకునై
చాపంబు సంధింతునా?
తనసామ్ముఁ గొనఁజూచు తల్లిపయి న
స్త్రంబుల్ ప్రయోగింతునా?
అనుజుఁ నిష్కలుషాత్మకుఁ భరతు సం
హరింతునా? నీమనం
బునకుఁ నచ్చిన దేది పాతకము లీ
మూఁడింటిలోఁ దమ్ముఁడా?

లక్ష్మణుఁడు—— (కన్నీళ్లు జాఱఁగా) హా! అయ్యో! అన్నా! నా దుఃఖవిషయ మెఱుఁగక దూఱుచుంటివిగదా!

ఆ. లేకపోవుఁగాక నీకు రాజ్యమ్ము; నా
కంత దానికొఱకుఁ జింత లేదు;
ఏండ్లు పదియునాలు గిలు వీడి యడవి నీ
వధివసింపవలయునట గదన్న!

రాము—— ఓహో! నాయనగారిందువలన మూర్ఛిల్లిరి. ఇసీ! అప్రభుత్వమును ప్రకటించిరి గదా వారు, మైథిలీ!

గీ. ఇపుడు నీ కవదాతిక యిచ్చినట్టి
నారచీరలు గొని తెమ్ము నాకుఁగూడ,
నేనిదే యన్యభూపతుల్ పూననిదియు
నాచరింపనిదియు ధర్మ మాచరింతు.

సీత—ఆర్యపుత్త్రులు పుచ్చుకొండి!

రాము—మైథిలీ! నీవిషయ మేమి?

సీత—నేను మీకు సహధర్మచారిణినిగదా!

రాము—నేనొక్కఁడనేకదా వెళ్లవలసినది.

సీత—అందుకనేకదా నేనూ వస్తాననడము?

రాము—అడవులలో వసింపవలెను సుమా!

సీత—అడవులు నాకు మాడువులే అవుతవి సుమండీ!

రాము—అత్తమామలకు శుశ్రూష కూడ నీవు చేయవలసియున్నదిగదా!

సీత—దానికోసమై వేలుపులకు మ్రొక్కుకొంటున్నాను.

రాము—లక్ష్మణా! నీవది నెను నివారింపుము

లక్ష్మణుఁడు—అన్నా! మెచ్చఁదగినపట్టున నీవెను నివారింపు మనుచుంటివి. నివారింప నే నుత్సహింపను. ఏ లన—

ఉ. తారక వెన్నడించును సు
ధాకరు రాహువు మ్రింగునప్పుడున్,
భూరుహ మూర్వి గ్రుంగ వెస
గ్రుంగును దీవయు, నేస్తు ఆంపిలోఁ
గూరుకొనన్ గరేణువును
గూర్కొను, నీవె చరించు ధర్మ మా
తీరున నిన్ను వెన్కొని, స
తీమణి భర్తృసనాథయే కదా!

చేటి—(ప్రవేశించి) అమ్మగారికి జయము! అలంకారసామగ్రిని కాపాడే రేవమ్మగారు మీకు మ్రొక్కి విన్నవించుకొన్నది: "అవదాతిక సంగీతశాలలోనుంచి ఆ నారచీరల్ని చించుకు తీసుకు వచ్చింది. ఇవిగో, ఇవి ఉపయోగపరచనివి, కొత్తవి; వేరే ఉన్నవి. మీరు వీటిని ఉపయోగించుకోవచ్చును." అని.

రాము—అమ్మా! ఇటు తెమ్ము. మీయమ్మ
గా రింతకు ముందు కైకొన్నవానితో సంతోషిం
చెను. ఇవి మాకుఁ గావలెను.

చేటి—చిత్తం! దొరగారు! తీసుకోండి!

(ఇచ్చి వెళ్లును.)

రాము—(గ్రహించి తాల్చును.)

లక్ష్మ—అన్నా! మన్నింపుము.

గీ. వస్త్ర భూషణ మాల్యాది వస్తువులను
ముందుగాఁ జక్క సగ మిచ్చుచుందు వెపుడు
నిప్పు డటు నాకు వల్కల మీయకుండ
నొక్కఁడవె తాల్చి తిది యేమియుక్త మన్న

రాము—మైథిలీ! ఈతని నివారింపుము.

సీత—సౌమిత్రీ! ఊరుకోవయ్యా.

లక్ష్మణుఁడు—

గీ. అమ్మ! నీకొక్కరితకె మా యన్నగారి
యడుగుఁదమ్ముల సేవింప నాస్థ యగునె?
కుడియడుగు నీకెయగుఁగాక, యెడమయడుగ
పడయఁగానిమ్ము న; న్నెడమడుగు వలదు.

సీత — ఆర్యపుత్త్రులు కరుణించవలెను. సౌమిత్రి సంకటపడుతున్నాడు.

రాము — సౌమిత్రీ! వినుము, వల్కలము లనఁగా,

గీ. కళ్లె మింద్రియము లను కంఖాణములకు
సంగరక్ష తపం బను సంగరమున,
కంకుశము నియమం బను హస్తి కింక
ధర్మరథముసారథి దీనిఁ దాల్పుమోయి!

లక్ష్మ — అనుగృహీతుఁడను.

(గ్రహించి తాల్చును.)

రాము — ఈ వృత్తాంతమును విని పౌరులు రాజమార్గమున క్రిక్కిఱిసియున్నారు! త్రోవ తొలఁగుఁడు! త్రోవ తొలఁగుఁడు!

లక్ష్మ — అన్నా! నేను ముందు నడచెదను. త్రోవ తొలఁగుఁడు! త్రోవ తొలఁగుఁడు!

రాము — మైథిలీ! ముసుఁగును దీసివేయుము.

సీత — చిత్తము. ఆర్యపుత్త్రు లానతిచ్చినట్లు!

రాము—ఓహో! పౌరులారా! వినుండు! వినుండు!

ఉ. ఆజ్ఞ యొకింత లేదు కనుఁ
డయ్యా! కనుం! డిదె నాదుభార్య, బా
హ్యజ్ఞపితవ్యథంబు లగు
వక్త్రములం బ్రజలార! నిర్గతా
వజ్ఞ మగుఁ గనుంగొనఁగ
వచ్చును గాంతల నెల్ల వారికిఁ
యజ్ఞమునం, వివాహమున,
నాపదయం, దటవీస్థలంబునన్.

కాంచుకీయుఁడు— (ప్రవేశించి) బాబూ! వెడలవలదు. వెడలవలదు. వీరుగో మహారాజు లుంగారు!

చ. అడవులకుఁ సతీమణి స
హాయముగాఁ జనుచుంటి వీ వటం
చడుగక లక్ష్మణుండును స
హోదరభక్తిని వెంబడించె నం
చడలుచు నాలకించి నృపుఁ
డంగము ధూళిని బ్రుంగి క్రుంగ వ

చ్చెడు నిదె! కాననంబు విడి
చెచ్చెర వచ్చెడు నేనుఁగో యనన్.

లక్ష్మ—అన్నా!
నారచీరలు దాల్చి వనప్రవాస
మరుగు మన కిప్పు డేమి దృశ్యంబు గలదు?

రాముఁడు—
అడవులకు మన మేఁగంగ, నవల వచ్చి
ఱేఁడు మన యున్కిపట్లు దర్శించుఁగాక!

[అందఱును వెడలిరి.]

ఇది ప్రథమాంకము

ప్రతిమా నాటకము

ద్వితీయాంకము

[కాంచుకీయుఁడు ప్రవేశించును.]

కాంచు—ఓహో! ఎవరు! ద్వారముగా
చున్న వాండ్రు? మీరుమీరు మీమీస్థానములం
జాగ్రత్తతో నుండుఁడు!

ప్రతీహారి—(ప్రవేశించి)అయ్యా! ఇ దేమిటి

కాంచు—ఇదియా? మహారాజులుంగా
సత్యవాక్యరక్షణపరులై యరణ్యమునకు వెడ
చున్న రామచంద్రమూర్తిని మరలింపఁజాల
పుత్త్రవిరహశోకాగ్నిచే దగ్ధహృదయులై పిచ్చి
వానివలె హెచ్చు ప్రలాపించుచు సముద్రగృహ
మునఁ బండుకొన్నారు. అక్కడ—

చ. కడఁగి యుగాంతకాలమునఁ
గంపిలు మేరుమహీధరంబుకై

వడిఁ, గలగుండుగా నివ్వురఁ
బాఱు మహోదధిపోల్కి, బింబమా
త్రుఁ డయి మహోర్చులం దొరఁగి
తూలెడు సూర్యునిరీతి, నెమ్మనం
బెడరున గ్రుంగ, నంగ మిఱి
యింపులఁ గంపిల లేఁడు వాఁడెడున్.

ప్రతీహారి—అయ్యో! అయ్యో! మహారాజులుంగా రిటువంటి అవస్థలో ఉన్నారా?

కాంచుకీయుఁడు—అమ్మా! పొమ్ము.

ప్రతీహారి—అయ్యా! వెళ్తున్నాను. (వెళ్లును.)

కాంచు—(అంతటఁ గలయం జూచి) ఎంత కష్టము! శ్రీరామనిర్గమనదినము మొదలుకొని యీయయోధ్య వట్టిపోయినట్టుగానే కానవచ్చుచున్నది. ఏ లనఁగా—

సీ. కవణంబు గైకోక గంధేభయూథంబు
బృంహితంబులు మాని బీదవడియె
మోరఁ గన్నీరు జాల్వాఱఁ దుక్ఖారవముల్
వసివాఁడె హేషారవంబు దక్కి

పౌరు లెల్లరును స్త్రీబాలవృద్ధులతోడ
దీనదీనాస్యులై దిగులు గుడిచి
రాహారమును మాని హాహా యటంచు గ
గ్గోలుగా నెలుఁగెత్తి కూయు లిడుచు

తోడరి రాముండు కులకాంతతోడ భూమి
జాతతో, భ్రాతతోడ లక్ష్మణునితో వ
నమ్మునకు నేఁగుచున్న మార్గమ్ముబడినె
కాంచు చుండిరి గన్నీరు నించుచుండి.

నేను నిదిగో మహారాజులుంగారిని జేరఁ బోయెదను. (పరిక్రమించి చూచి) ఓహో! వీరె మహారాజులుంగారు! మహాదేవిగారును, సుమిత్రాదేవిగారును మిక్కిలి దుస్సహ మయిన దయినను పుత్త్రవిరహశోకమును నిగ్రహించుకొని తమ్ము నోదార్చుచుండఁగా వారితో నిక్కడ నున్నారు. ఈయవస్థ కష్టముగా నున్నదిగదా! వీరు, ఈ మహారాజులుంగారు!

ఆ. అయ్యయో! యయో! యటంచుఁ బేరెలుఁ
వాచఱచుచు లేచిలేచి పడును [గున

ఏఁగె రాముఁ డడవి కేదెసఁ బట్టి యా
దెసకె రిత్త తేరి తేరి చూచు.

(నిష్క్రమించెను.)

ఇది మిశ్ర విష్కంభము.

[అంత యథానిర్దిష్టముగా రాజును, రాణులును
ప్రవేశింతురు.]

రాజు——

స. హాహాహా! తండ్రి! రామా! యఖిలభువన నే
త్రాభిరామాంగధామా!
హాహాహా! లక్ష్మణా! నాయన! సముచిత ల
క్ష్మాంగకవ్యాప్త దేహా!
హాహాహా! సాధ్వి! సీతా! అధిపతిహిత కా
ర్యాన్వహాయత్తచిత్తా!
హాహాహా! యేఁగినారే యడవికి నయయో!
యయ్యయో నాతనూజుల్!

చిత్ర మిదిగదన్నా! భ్రాతృస్నేహమువలన, పితృప్రీతిని విడనాడినవాఁ డయినను లక్ష్మణునిఁ జూడఁగోరుచున్నాఁడను. బిడ్డా! వైదేహి!

క. విడనాడె రామచంద్రుఁడుఁ
జెడనాడెను లక్ష్మణుండు క్షితితలమందుౕ
గడు దుర్యశమునకుం బా
ల్పడిన ననుౕ నీవుగూడ వర్జించితివే !

పుత్త్రీ రామ! నాయనా లక్ష్మణా! బిడ్డా వైదేహీ! నాకు బదులు పలుకుం డబ్బలారా! శూన్య మిది. అయ్యో! నా కొక్కరును బదులు పలుకకున్నారు. కౌసల్యాతనయా! ఎక్కడ నున్నాఁడవు?

గీ. సత్యసంధ! విమత్సర! శాంతహృదయ!
సర్వలోకాభిమత! గురుజనవిధేయ!
రమ్యసుగుణాభిరామ! శ్రీరామ! రామ!
పలుకఁగదవన్న నాకొక్క బదులుపలుకు!

అయ్యో! సర్వజనహృదయనయనాభిరాముఁ డగు నారాముఁ డెక్కడ? ఆ పితృవాక్యానువర్తనుం డెం దుండె? శోకార్తులయెడ నా యనుకంప యే మయ్యె? రాజ్యైశ్వర్యమును దృణమువలె లెక్కసేయని నాతండ్రి యేఁడి! నాయనా! రామా! వృద్ధుఁ డగుతండ్రిని నన్ను విడిచి, యసంబద్ధమగు

ధర్మమును నీవేల యనుచరింపవలెనోయి?
అయ్యో! ఇసిరో! కష్టమయ్యో!

గీ. సూర్యునస్తేఁగె రాముండు సూర్యునంటి
యరుగుదినమట్లు లక్ష్మణుం డనుగమించె
రవియును దినంబు వెడలినయవల ఛాయ
గానరానట్లు సీతయుఁ గానరాదు.

(పయికిఁ జూచి) ఓ! కృతాంతహాతకా!

గీ. గొడ్డుఁబోతుఁగా మమ్మును, దొడ్డజేసి
కన్యనకు నెవ్వనికొ రాము నాత్మజునిఁగ,
నడవిఁ బులిఁ గాఁగఁ గైకేయి నర్హారీతి
మూఁడు నిటు లేలయా చేయఁజూడనైతి?

కౌసల్య— (ఏడ్చుచు) ఊరుకోండి, నిబ్బ రించుకోండి యింక. మీరింతగా సంతాపపడుతూ పారవశ్యం తెచ్చుకోవడం తగదు. కోడలు, కుమాళ్లు మీరు మాట యిచ్చినకాలము దాటగానే వస్తారు. చూడవచ్చును.

రాజు—ఓసీ! ఎవతెవే నీవు?

కౌసల్య—మీదయకు తప్పిన కొడుకును గన్నతల్లిని నేను.

రాజు—ఏమీ! ఏమీ! సర్వజన నయన హృదయాభిరాముఁ డయిన రామునకుఁ దల్లివి కౌసల్యవా?

కౌసల్య—దేవా! ఆ దురదృష్టవంతురాలనే నేను.

రాజు—కౌసల్యా! సారవతివిగదనే! రాముని గర్భమున ధరించితివి.

ఆ. అగ్నితుల్య మమిత మతిదుస్సహంబు దుః
ఖంబు నన్ను మిగులఁ గాల్చుచుండ
సంహరింపఁజాల సహియింపనుం జాల
నెట్టులోర్తు? ప్రముషితేంద్రియుండ!

(సుమిత్రను జూచి) వేఱొకతె ఇది యెవర్తె?

కౌసల్య—నాయన లక్ష్మణుని— (అర్ధోక్తిలో)

రాజు—(తొందరతో లేచి) ఏఁడీ! ఎక్కడ, లక్ష్మణుఁ డెక్కడ! లేఁడే? అయ్యో కష్టము!

(రాణులు తొట్రుపాటుతో లేచి రాజును బట్టుకొందురు.)

కౌసల్య—కాదండీ! నాయన లక్ష్మణునితల్లి సుమిత్ర అని చెప్పబోతిని.

రాజు—ఓసి సుమిత్రా!

ఆ. ఓసి! నీకుమారుఁడే సత్కుమారకుం
డగు; న దే మనంగఁ బగలు రేయు
రామచంద్రమూర్తి రఘువంశదీపకు
నీడవోలె నతఁడు వీడకుండె.

కాంచుకీ—(ప్రవేశించి) మహారాజులుంగారికి జయము. వీరుగో! పూజ్యులగు సుమంత్రులవారు విచ్చేసిరి.

రాజు— (తొందరతో లేచి) రామునితో వచ్చెనా?

కాంచుకీ—లేదు. రథముతో వచ్చెను.

రాజు—ఏమీ! ఏమీ! రథముతోనా? వట్టిరథముతోనా? (అని మూర్ఛితుఁడై పడును)

రాణులు—దేవా! ఊరడిల్లుండి. ఊరడిల్లుండి.

(అవయవములఁ దడవుదురు.)

కాంచుకీ—అయ్యో! కష్టము! ఇటువంటి మహాపురుషులుగూడ నిటువంటియాపదను బొం

పోదు రనఁగా విధి యెంత యనతిక్రమణీయ మన్నమాట! మహాప్రభూ! ఊఁ అడిల్లుఁడు, ఊఁ అడిల్లుఁడు.

రాజు—(ఇంచుక తెప్పఱిల్లి) బాలాకీ! సుమంత్రుఁ డొక్కఁడేకదా వచ్చినది?

కాంచుకీ—అవును.

రాజు—అయ్యో! కష్టము!

ఆ. రథము శూన్య మై పరావృత్త మయ్యెనా?
నామనోరథంబు నష్ట మయ్యె
అనిపె నేమొ దశరథునిఁ దోడుకొని పోవు
పొంచె రథముఁ గాలపురుషుఁ డిపుడు.

అట్లైని శీఘ్రముగాఁ దోడ్కొని రమ్ము.

కాంచుకీ— చిత్తము. మహారాజులుంగారి సెలవుప్రకారము. (వెళ్లును)

రాజు—

గీ. అడవినెత్తమ్మికొలఁకుల సుడిసి వచ్చు
కమ్మఁదెమ్మెరల్ భాగ్యవంతమ్ము గావె
తనివు జనియింప నయ్యెడి తాఁకుచుండు
నడవిఁ దిరుగాడు శ్రీరామునంగకముల.

(అంత సుమంత్రుఁడు ప్రవేశించును.)

సుమం—(అంతటను గలయఁజూచి శోకముతో)

మ. తమ కృత్యమ్ములు వీడి భృత్యజను ల
త్యంతంబు నెయ్యంబు తి
య్యము పెంపొందినరామచంద్రు నెడఁబా
యక లేక శోకాగ్నియం
గములం గాల్పఁగఁ గన్ను లశ్రులఁ దొలం
కఁ దీనదీనాస్యులై
గము లై బెగ్గిలి యేడ్చుచున్న నృపతిం
గర్జించుచున్నా రహో!

(చేరఁబోయి) మహాప్రభూ! జయము.

రాజు—

సీ. అన్నా! సుమంత్ర! నాఁగుపుత్త్రుఁడు—
కాదుకాదు తప్పుగాఁ బలికితిని.

సీ. అన్నా! సుమంత్ర! నీయగ్రపుత్త్రుఁడు రాముఁ
డెచ్చట నున్నాఁడో యెఱుఁగఁ జెప్పు
అల విదేహాధీశునకుఁ గూఁతురు గురు
శుశ్రూషు విప్పు డెచ్చోటఁ గలదు?

భ్రాతృసేవైకతత్పరచిత్తవృత్తి యౌ
సౌమిత్రి తాను నెచ్చటఁ గలండు?
మరణ మాసన్న మై దురపిల్లుచున్నట్టి
చిన్నఁటితండ్రిని నన్నుఁ గూర్చి
సకలలోక శోకసాగర సంక్షోభ
కరము గాఁగ నేమి గాని నీకుఁ
జెప్పి పంపినారొ యిప్పు డద్దానిని
దప్పకుండ నాకుఁ జెప్పు మన్న!

సుమం—మహాప్రభూ! వలదు వలదు. అమం గళవచనము లిట్లు పలుకవలదు. అచిరముననే వారిని మీరు చూడఁగలరు.

రాజు—అగును. నేనయుక్తముగానే యడిగితిని. అది తపస్వులవిషయమున నడుగఁదగిన ప్రశ్నము గాదు. ఇఁకఁ జెప్పుము. తపస్వుల తపస్సు వర్ధిల్లుచున్నదా? అరణ్యములు స్వాధీనము లయ్యెనా? అక్కడఁ దిరుగుచో వైదేహి క్లేశపడుట లేదుగద!

సుమిత్ర — సుమంత్ర! నారచీరలలుంగలు ఒంటినిండా ధరించుకొని పసిబాల అయి ఉండి

కూడా ఆరి తేరినవారి నడవడిక నేర్చుకొన్న మా సీతమ్మ అడవులలో పెనిమిటికి సహధర్మ చారిణి అయి మమ్ములను గూర్చి మహారాజులుం గారిని గూర్చి ఏమయినా చెప్పిపంపిందా?

సుమం—అందఱును మహారాజులుంగారిని గూర్చియే -

రాజు—ఆఁగు. ఆఁగు. శ్రోత్రరసాయనములు నాకు హృదయాతురౌషధములును అయిన వారి నామధేయములను కేర్కొనియే చెప్పుము.

సుమం—మహాప్రభువుల సెలవుప్రకారము. చిరంజీవి రామమూర్తి

రాజు—రామమూర్తి అనియా, వీఁడుగో రాముఁడు. వానినామమును విన్నంతనే నాకు వానిని దాఁకినట్లున్నది. ఇఁక, ఇఁక—

సుమం—చిరంజీవి లక్ష్మణుఁడు

రాజు—వీఁడుగో లక్ష్మణుఁడు. ఇఁక ఇఁక,

సుమం—ఆయుష్మతి సీత, జనకరాజపుత్రి.

రాజు—ఇదిగో వైదేహి. రాముఁడు, లక్ష్మణుఁడు, వైదేహి అని యీవరుస సరి గాదు.

సుమం—ఇఁక వరుస యెట్లు?

రాజు—రాముఁడు, వైదేహి, లక్ష్మణుఁడు అని చెప్పుము.

ఆ. ఇడుమ లడవులందుఁ గడుఁ గల్గు మాయమ్మ
కాఁపు గల్గి యుండఁ గా వలయును
నామసంగ్రహణముననుగూడ రామ ల
క్ష్మణుల నడుమ సీత మసలుఁగాత!

సుమం—చిత్తము మహాప్రభువుల సెలవు ప్రకారమే. చిరంజీవి రామమూర్తి

రాజు—వీఁడుగో రామమూర్తి.

సుమం—ఆయుష్మతి జనకరాజ పుత్త్రి

రాజు—ఇదిగో వైదేహి.

సుమం—చిరంజీవి లక్ష్మణుఁడు.

రాజు— వీఁడుగో లక్ష్మణుఁడు. రామ! వైదేహి! లక్ష్మణ! కౌఁగిలించుకొనుఁడు నన్ను బిడ్డలారా!

మధ్యాక్కర.—

ఒకమాఱు తనుపారఁ గౌఁగిలింతునో
యొద్దఁ జేర్చుకొని
యొకమాఱు కనులారఁ గాంతునో రాము
నొప్పులకుప్ప
వికలజీవితుఁ డమృతమున జీవించు
విధమున నేను
సుఖపడి మరల జీవింతు నని తలంచుచు నున్నవాఁడ.

సుమం—శృంగిబేరపురమున రథమునుండి దిగి యయోధ్యాభిముఖు లై నిలుచుండి యందఱును మహారాజులుంగారికిఁ దలతో నమస్కరించి విన్నవించుకొన నుపక్రమించిరి.

ద్వి. తడ వేదియో చెప్పఁ దలపోసి; రపుడు
వడఁకెను నోఁడువంగ వాతెఱగూడ
అప్పళించెను గంఠ మంతఁ గన్నీరు
చెప్పకే యడవికిఁ జేరిరి వారు.

రాజు—ఏమీ! ఏమియుఁ జెప్పకుండనే యడవి కేఁగిరా? (అని రెట్టింపు మోహమును జెందును.)

సుమం—(తొట్రుపాటుతో) బాలాకీ! మహారాజులుంగారు అప్రతీకార మయిన యవస్థలో నున్నా రని యమాత్యులకుఁ దెలుపుము.

కాంచుకీ—అట్లే. (వెళ్లును.)

రాణులు—దేవా! ఊరడిల్లుఁడి! ఊరడిల్లుఁడి

రాజు—(ఇంచుక యూఱడిల్లి)

గీ. సంస్పృశింపుము నన్నుఁ గౌసల్య! నిన్నుఁ
గాంచుటకు నాదుకనుదోయి కానరాదు
అరిగె శ్రీరామచంద్రునిదరికి మనము
మరలి రా దిప్పటికి నందె మరగియుండె.

నాయనా! రామా! ఎడతెగక నే నిదే తఁ పోసితినిగదోయీ!

సీ. కానక కన్న సంతానమ్ము నిన్ను సు
శ్రీ రాజ్యమున నభిషిక్తుఁ జేసి
రక్షింపఁగల దొడ్డ రాచగున్న లభించు
కతమునఁ బ్రజఁ గృతార్థతకుఁ దార్చి
తమ్ముఁగుఱ్ఱల సంతతము భవత్సమవైభ
వులఁ జేయు మని నీకుఁ దెలియఁ జెప్పి

చింతఁ బోకార్చ విశ్రాంతిఁ జేకూర్పఁ బ
ర్యాప్త మహా మునివనాశ్రమముఁ జేరి
జీవితావశేషంబు పోఁద్రోవవలయు
ననుచుఁ దలఁచు నావాంఛితం బక్కటకట!
క్షణములోపల సర్వంబుఁ గణఁగి యన్య
థాకరించెను రాకాసికైక తనయ!

సుమంత్రా! కైకేయికిఁ దెలుపుము.

ఆ. చనియె రాముఁ డనుచు సంతోషపడు మను
ముసుఱు లెల్ల నాకు నుడిఁగె ననుము
తోడుతోడఁ గొడుకుఁ దోడ్తెచ్చుకొను మను
పాపఫలము తనకుఁ బండె ననుము.

సుమం—మహాప్రభువుల సెలవు ప్రకారము.

రాజు—(మీఁదికిఁ జూచి) అహో! రామ కథాశ్రవణ సందగ్ధహృదయుఁడనగు నన్ను నోదార్చుటకుఁ బితరు లరుదెంచిరి! ఎవ రక్కడ?

కాంచుకీ—(ప్రవేశించి) జయము మహారాజులుంగారికి.

రాజు—ఉదకమోయి!

కాంచుకీ—సెలవుప్రకారము మహాప్రభూ! (నిష్క్రమించి ప్రవేశించి) చిత్తము మహాప్రభూ! ఇదిగో ఉదకము.

రాజు—(ఆచమించి చూచి)

గీ. ఇంద్రునకు నెచ్చెలి దిలీపుఁ డితఁడె! యితఁడె
రఘువు! నాతండ్రి యజమహారా జితండె!
ఏల వచ్చితిరయ్య మీ రిచటి కిపుడు?
నేనె మిముఁ జేరవచ్చుచున్నానుగాదె!

రామ! వైదేహి! లక్ష్మణ! నే నిఁక పితరుల సన్నిధికిఁ బోవుచున్నాను! ఓపితరులారా! నేను, ఇదిగో నేను, వచ్చుచున్నాఁడను.

(మూర్ఛలో మునిఁగెను)

(కాంచుకీయుఁడు తెరవైచును.)

అందఱును—అయ్యో! అయ్యో! మహారాజులుంగారు! (నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము

ప్ర తి మా నా ట క ము

తృ తీ యా ం క ము

[అంత సుధాకారుఁడు ప్రవేశించును]

సుధాకారుఁడు — (ఊడ్చుట మొదలగు పనులు చేసి) అమ్మ! అయినది. సంభవకయ్యగారు సెలవిచ్చినపని అంతా చేశాను. కాస్తంత సేపు పండుకొంటాను. (శయనించును)

భటుఁడు—(ప్రవేశించి చేటునిఁ జేరఁబోయి తన్ని) ఒరే! ముండకొడకా! ఏమిరా పని చేయకుండా పండుకొన్నావు? (మరలఁ దన్నును)

సుధా—(మేలుకొని) తన్నవయ్యా! నన్ను తన్ను.

భటుఁడు—తన్ను తాను ఏమిచేస్తావురా?

సుధా—ఏం జేస్తాను! బక్క—ముండకొడుకను! కారతపీరయ్యకుమల్లే వెయ్యిచేతు లున్నయ్యా నాకు?

భటుఁడు—వెయ్యిచేతు లుంటే ఏమి చేస్తావురా?

సుధా—నిన్ను సంపేస్తాను.

భటుఁడు—రా ముండకొడకా రా! నిన్ను చంపి వదలిపెట్టుతాను! (మరలఁ దన్నును)

సుధా—(రోదనము చేసి) నావల్ల తప్పే మైనా కనుక్కోఁగల్తివా దొరా! తన్తావు!

భటుఁడు—లేదురా! నీవల్ల తప్పు లేదు. నేను నీతో చెప్పితినిగదా, బాబుగారు రాముల వారికి రాజ్యం పోయిందని మనసుచెడి దశరథ మహారాజులుంగారు చనిపోగా వారిని ప్రతిమా గృహమున దర్శించవలె నని ఇప్పుడు కౌసల్యమ్మ గారు మొదలయిన జనానావా రంతా ఇక్కడికి వస్తా రని! ఇక్కడ నీ విప్పు డేమి చేస్తున్నావురా!

సుధా—చూడు దొరా! లోపలింట్లో పిచ్చిక గూళ్లు ఎత్తివేశాను. గోడలమీద సున్నప్పట్లో ఐదేసిలంగుళాలకు శ్రీచందనప్పట్టెలు తీర్చినాను. వాకిళ్లకు తోరణాలు గట్టినాను. ఇసక చల్లినాను. ఇంక ఏమిటయ్యా నేను చేయనిది?

భటుఁడు—అట్లా చేస్తే సరే. పరవాలేదు పో. ఇదుగో నేనూ వెళ్లి అంతా ససిపరచడ మైనదని అమాత్యులవారికి విన్నవించుకొంటాను.

[వెళ్లిరి.]

ఇది ప్రవేశకము.

[అంత భరతుఁడు, రథముతో సూతుఁడు వత్తురు.]

భరతుఁడు—(ఆవేగముతో) సూత! మేనమామగారియింటఁ జాలనాళ్లనుండి యుండుటచే వార్త లేమియుఁ దెలియవయ్యెను. మహారాజులుంగారు మిక్కిలి అస్వస్థశరీరులుగా నున్నారని వింటిని. అది చెప్పుము.

*ఉ. నాయన కేమి వ్యాధి?

సూతుఁడు—ఎద నాఁటిన పెన్వగచూవె;

భర—ఏమి యంద్రో యది వైద్యులు?

---

*ఉ. నాయన కేమి వ్యాధి? యెద
నాఁటినపెన్వగచూవె; యేమి యం
ద్రో యది వైద్యు? లయ్యది కు
దుర్పఁగరానిదిగాదె వారికిన్;

సూతు—అయ్యది కుదుర్పంగ రానిది గాదె వారికిఁ;

భర—ఓయిర మేమి?

సూతు—లేద యెదియున్;

భర—శయనంబో?

సూతు—ధరిత్రిమీఁద;

భర—ఇంకేయది దిక్కు?

సూతు—దైవము.

భర—ఎద నీఁగెద వేగ రథంబుఁ ద్రోలుమా!

సూతు—బాబుగారి సెలవు ప్రకారము.

(వడిగాఁ ద్రోలును)

భర—(రథవేగమును నిరూపించి) బలే! బలే! రథవేగము!

ఓయిర మేమి? లేద యెదియున్;
శయనంబో? ధరిత్రిమీఁద; నిం
కేయది దిక్కు? దైవ; మెద
నీఁగెద వేగ రథంబుఁ ద్రోలుమా!

చ. పరువిడునట్లు చెట్లు గను
పట్టెడు వెన్కకుఁ జిన్న చిన్నవై
పొరలి వహించు నేలువలె
భూమి చొరంబడు నేమిరంధ్రమం
దరము లెఱుంగరావు, కద
లాడవొకో యనఁ దోఁచుఁ జక్రముల్
తురగఖురాళి ధూళి వెను
ద్రొక్కక తేరిదె మీఱి దూఁకెడున్.

సూతు—బాబూ! అల్లదిగో చెట్లు గుబురుకొని శ్యామాయమానములై ఉన్నవే: అదే యయోధ్య కావలెను.

భర—అన్నా! స్వజనదర్శనోత్సుకతచే నా మన సెంత తొందరపడుచున్నది! ఇప్పుడు—

సీ. కడ కేఁగి నాయనగారి పాదమ్ముల
పయిఁ దలతోడ నేఁ బడినయట్లు
కూర్మిమై నను ఱేఁడు గ్రుచ్చి యెత్తినయట్లు
నన్నదమ్ములు చుట్టుకొన్నయట్లు
అశ్రులు రాల మాయమ్మలు పుతపుత
మన్నట్లు నే జాలిగొన్నయట్లు

వచ్చి భృత్యులు కోల్వఁ జొచ్చిపోలఁగ నొడ్డుఁ
బాడుగుం బెఱఁగ నంచుఁ బొగడినట్లు
అంత మాయన్న సౌమిత్రి చెంతఁ జేరి
నాకుఁ గేకయదేశమ్మునను నలవడి
నట్టి వేషభాషణముల నపహసించి
నట్టు నిల్లెన్నొ మదిలోనఁ దట్టుచుండె.

సూతు——(ఆత్మగతము) అయ్యో! కష్టము! ఈచిన్నబాబు మహారాజులుంగారిమరణము నెఱుఁగక, ఉత్తరక్షణమున రిత్తవోనున్న యాశను మోచుచు నయోధ్యను బ్రవేశించుచున్నాఁడు! ఎఱిఁగియుండియు నేను దెలుపనయితిని! ఏ మన—

గీ. తండ్రిగారి వపుఃపరిత్యాగ మొకటి
తల్లి యైశ్వర్యలోభ్యవృత్తాంత మొకటి
అన్న వనవాస మొక్కటి యక్కటకట!
ముప్పు లివి మూఁడు నే నెట్లు చెప్పఁగలను?

భటుఁడు——(ప్రవేశించి) బాబుగారికి జయము!

భరతుఁడు——అబ్బే! ఏమి శత్రుఘ్నుఁడు నన్నెదుర్కొన వచ్చెనా?

భటు—బాబుగారు! వారదిగో వచ్చుచు న్నారు. ఉపాధ్యాయులవారు ముందు మీకిట్లు సెల విచ్చిరి.

భర—ఏమని? ఏమని?

భటు—"కృత్తికానక్షత్ర మింక నొక్క గడియ గలదు. కావున నీగడియ గడచి రోహిణీ నక్షత్రము వచ్చినతర్వాతనే నగరప్రవేశము చేయ వచ్చును" అని.

భర—మంచిది. అట్టులే చేయుదును. నేనెన్నఁ డును గురువచనమును మీఱలేదు. నీవు పొమ్ము.

భటు—బాబుగారిసెలవుప్రకారము (వెళ్లును)

భర—ఇప్పు డెచ్చోట విశ్రమింతును? కానీ! చూచితిని. ఈ చెట్లచాటునఁ గనుపట్టుచున్న దేవళ మున నీగడియసేపు విశ్రమింతును. దేవపూజయు, విశ్రాంతియు రెండును గలసివచ్చును. అదియుఁ గాక ఊరిబయటఁ గొంత విశ్రాంతిఁ గొని నగర ములలోఁ బ్రవేశించుట పెద్దల యాచారము. కనుక రథము నాఁపుము.

సూతు—బాబుగారి సెలవు ప్రకారము.

(రథము నాఁపును)

భర—(రథముననుండి దిగి) సూత! గుఱ్ఱములను విడిగా విశ్రమింపఁజేయుము.

సూతు—బాబుగారి సెలవు ప్రకారము.

(వెళ్లును)

భర—(కొంచెము నడచి చూచి) లెస్సగాఁ బూవులచేతను, ప్రేలాలచేతను బలు లుంచినారు. గోడలపై నైదేసియంగుళములకుఁ జందనపుఁ బట్టెలు వెట్టినారు. ద్వారముల కెల్ల మాల్య తోరణములు గట్టినారు. ఇసుకఁ జల్లినారు. ఇది యే మయి యుండును? ఏదేనియుత్సవవిశేషమా? లేక యనుదినము నిట్టియాస్తిక్యమే యిక్కడ నడచునా? ఇది యేదేవరగుడియో కదా! ఇక్కడ నేదేని యాయుధము గాని, ధ్వజము గాని బహిశ్చిహ్నము గానరాకున్నది. కానీ! ప్రవేశించి చూచెదను. (ప్రవేశించి చూచి) ఆహాహా! ఱాలమీఁదిశిల్పసౌందర్య మెంత యబ్బురముగా నున్నది! బలే! ప్రతిమలకు భావవ్యక్తి

యెంత స్పష్టముగా నున్నది! ఈప్రతిమలు దైవతోద్దిష్టము లయినను, మానుషవిశ్వాసమును గల్గించుచున్నవి. ఇది చతుర్దైవత మగు స్తోమమా యేమి? అవి యేవియేని యగుఁగాక! నా మది కెంతో సంతోషము గొల్పుచున్నవి.

గీ. దైవతములే యగుదు రని తలఁచి తలను
వంచి కావించువాఁడ నే వందనంబు
వేల్పుల కమంత్రకమ్ముగాఁ జల్పఁబడిన
వందన మ్మది యగుఁగాదె వార్షలంబు.

దేవకులికుఁడు—(ప్రవేశించి) ఓహో! నిత్యకృత్యాదికము ముగిసినపిదప భోజనమునకు నేను బోయియుండఁగా నీతఁ డెవ్వఁడో కాని యీ ప్రతిమలఁ బోలినవాఁడు ప్రతిమాగృహములోనికి వచ్చెను. కానీ! నేనును బోయి తెలిసికొందును.

భరతుఁడు—(ప్రవేశించి) నమోఽస్తు (ప్రతిమలకు మ్రొక్కును)

దేవ—వలదు వలదు. మ్రొక్కవలదు.

భర—అయ్యా! ఏల వల దనెదవు?

గీ. తప్పు నాయందు నేదేని చొప్పడియెనొ?
ముఖ్యులు మఱెవ్వరే మును మ్రొక్కవలెనొ?
ఏల వల దంటివయ్య నా కెఱుఁగఁ జెప్పు
లేక నీ కెదే నియమనిష్ఠాకలనము?

దేవ—మిమ్ముఁ బ్రతిషేధించినది యాకార ణములచేతఁ గాదు. ఏ మనఁగా దేవత లను తలఁపుతో బ్రాహ్మణజనము నమస్కారము చేయుచుండె నని ప్రతిషేధించితిని. ఈప్రతిమలు క్షత్త్రియులవి.

భర—అగును. ఈప్రతిమలు క్షత్త్రియులవే. కాని యేక్షత్త్రియులు వీరు?

దేవ—ఇక్ష్వాకులు.

భర—(సంతోషముతో) ఇక్ష్వాకులా? ఆ యయోధ్యాధీశ్వరులుగదా వీరు!

ఉ. తోడగుచుంద్రు రక్కసులఁ
ద్రుంప నిలింపుల కీమహారథుల్
వాడలతోడ నీసుకృత
వంతులు సొత్తురు దేవలోకముల్

వీడని బాహుదర్పమున
  విశ్వము గెల్చి చిరంబు బ్రోచి యీ
బ్రోడలు స్వేచ్ఛమైఁ దనువు
  పుత్తురు మృత్యు వొదింగి నిల్వఁగన్.

ఓహో! యాదృచ్ఛికముగా నేను గొప్పఫలమును బడసితినిగదయ్యా! తెలుపుము! వీ రెవరు?

దేవ—వీరా? సర్వరత్నములను సాధించి విశ్వజిద్యాగమును జేసినవారు, ప్రజ్వలితధర్మప్రదీపులు దిలీపులవారు.

భర—ధర్మమూర్తికి నమస్కారము. తెలుపుము! వీ రెవరు?

దేవ—వీరా? శయనింపఁబోవునప్పుడు, మేలుకొనినప్పుడు బ్రాహ్మణజనసహస్రములచే పుణ్యాహశబ్దరవమును వినుచుండినవారు, రఘువులవారు.

భర—ఆహా! బలవంతమగు మృత్యువు ఇట్టిగట్టిరక్షనుగూడఁ దప్పించుకొని ముట్టుకొనెను గదా! బ్రాహ్మణజన్ములకు రాజ్యఫల మర్పించిన ధర్మాత్మునకు వందనము. తెలుపుము! వీ రెవరు?

దేవ—వీరా? ప్రియావియోగనిర్వేదముచే రాజ్యభారమును విడనాడినవారు, నిత్యము నవభృథస్నానములఁ జేసి నిష్కలుషులై నెగడిన వారు, అజులవారు.

భర—శ్లాఘనీయపశ్చాత్తాపుఁ డయినమహనీయునకు నమస్కారము. (దశరథుని ప్రతిమను జూచుచు వ్యాకులపడి) అయ్యో! మనసు బహుమాన వ్యాక్షిప్తమయి యుండుటచే విస్పష్టముగా గుర్తింపఁజాలకున్నాఁడను. తెలుపుము! వీ రెవరు?

దేవ—వీరు దిలీపులవారు.

భర—మహారాజులుంగారిపితృపితామహుఁడు. తరువాత, తరువాత?

దేవ—వీరు రఘువులవారు.

భర—మహారాజులుంగారిపితామహుఁడు. తర్వాత?

దేవ—వీ రజులవారు.

భర—నాయనగారితండ్రి! ఏమంటివి? ఏమంటివి?

దేవ—వీరు దిలీపులు, వీరు రఘువులు, వీ రజులు—

భర—నిన్నించుక యడుగుచున్నాఁడను. బ్రదికియున్నవారి ప్రతిమలుగూడ నిలుపుదురా ?

దేవ—నిలుపరు; వెళ్లిపోయినవారివే.

భర—అందుచేతనే యడుగుచున్నాఁడను.

దేవ—ఉండుము.

గీ. అయ్యొ! స్త్రీశుల్కమునకునై యవనిభరము
తోడఁ బ్రాణమ్ములనుగూడ వీడుకొనియె
నెవ్వఁ డట్టి దశరథమహీతలేంద్రు
ప్రతిమ దీనిఁ బ్రశ్నింపవు, కత మదేమి ?

భర—హా! నాయనా !

(మూర్ఛితుఁడై పడును. మరల తెలివి తెచ్చుకొని)

మ. మనమా ! తెప్పిలుమా ! యెదేఁ దలఁచి సం
బ్రాంతంబ వౌచుంటివో,
వినుమా దానిని దండ్రిగారి మృతిదు
ర్వార్తాంతముఁ, ధైర్యముఁ

గొనుమా! నీచపుశుల్క—శబ్ద మది నా
కుఁ దాఁకునో యేమొ? నే
ననుమానింపక దేహశోధనము సే
యంగావలెఁ దానికై.

ఆర్యా!

దేవ—ఆర్యా యనుపిలు పిది యిక్ష్వాకు వంశ్యుల పిలుపుగదా! కైకేయీపుత్త్రు లగు భరతులా మీరు?

భర—అగును. ఆర్యా! అగును. దశరథ పుత్త్రుఁడను భరతుఁడను నేను; కైకేయీపుత్త్రుఁడను గాను.

దేవ—అయిన నొకటి యడుగుచున్నాను.

భర—అఁగుము. కడమ చెప్పుము.

దేవ—ఏమిగతి! చెప్పెద వినుఁడు. దశరథులవారు వెళ్లిపోయిరి. సీతాలక్ష్మణసహితులై రాములవా రడవి కేలవెడలిరో నాకుఁ దెలియదు.

భర—ఎట్టెట్టూ? ఆర్యుఁ డడవికిఁగూడ నరిగెనా?

(కెట్టింపు మోహ మందును)

దేవ—బాబూ! ఊఁటడిల్లుఁడు, ఊఁటడిల్లుఁడు.

భర—(ఊఁటడిల్లి)

ఆ. లేరు తండ్రిగారు లే రన్నగా రింక
నయ్యయో! యయోధ్య యడవి యయ్యె
ఎండిపోయినట్టియేటికిఁ దృష్ణార్తు
నట్టు నేను బరుగు వెట్టుచుంటి.

ఆర్య! సవిస్తరముగా విషయమును వింటినా నామనసు కుదుటఁబడును. కనుక సర్వమును సవిస్తరముగాఁ దెలుపుదువుగాక!

దేవ—వినుఁడు. మహారాజులుంగారు శ్రీరాములవారికి రాజ్యాభిషేకము చేయనుండఁగా మీతల్లిగా రడ్డు పల్కిరిగదా!

భర—ఆఁగుము.

సీ. అల శుల్కదోషంబుఁ దలపెట్టి పట్టంబు
గట్టఁగావలయు నాపట్టి కనియె
తద్ధైర్యమున మది నౌద్ధత్యము వహించి
యడవుల కార్యుని వెడలు మనియె

మాయన్న దానికి మాఱుమాటాడక
వెలువడె నారచీరలు ధరించి
అది చూడఁగాలేక యవనీతలేశ్వరుం
డసదృశంబుగ నప్పు డసుఱు విడిచె
ప్రకృతు లింకమీఁదఁ బరిపరివిధముల
నాదుతలనె చెడుగుఁ బాదుకొలిపి
తల్లినడవడికిని దగినట్లు బలుతిట్లు
తిట్టిపోయకుండు రెట్టు లయయొ!

(మోహమందును)

(తెరలో)

తోవతప్పకోండి అయ్యా, తోవతప్పకోండి!

దేవ—(చూచి) అన్నా!

ఆ. బిడ్డ మూర్ఛలోనఁ బడ్డాఁడు, రాణులు
నరుగుదెంచినారు సరిగ నిపుడె
తల్లి చలువచేతితాఁకుడు సంతాప
మార్చు చల్లనీటియంజలిగద!

(అంత రాణులు, సుమంత్రుఁడు ప్రవేశింతురు.)

సుమం—అమ్మలారా! ఇటు, ఇటు.

శా. ప్రాసాదంబులయందు నెందు నిటు సౌ
భాగ్యంబు మృగ్యం బనన్
భాసిల్లెన్ మును మాన్యపాలకునియా
వాసంబు నేఁ డట్టి యా
వాసిన్ బాసెను ద్వారపాలకుల ని
ర్వ్యాహంబు లే దాజ్ఞ లే
దే సత్కారము లేదు క్రోవరులు దా
రేతెంచుచున్నా రహో!

(ప్రవేశించి చూచి)

అమ్మలారా! వలదు. వలదు. ప్రవేశింప వలదు.

గీ. పడుచుఁ బ్రాయంపువాఁడు భూపాలునట్టు
లుండె నిదె యెవ్వఁడో పడియుండె నిచట!

దేవ—

ఎవ్వఁడో యని సందేహ మేటి కయ్య
యతఁడు భరతుండు మీరింక నాదుకొనుఁడు.

(వెళ్లును)

రాణులు—(తొట్రుతోఁ జేరఁబోయి) అయ్యో! నాయనా! భరతా!

భర—(ఇంచుక యూఱడిల్లి) ఆర్యా!

సుమం—జయము మహా—(అర్ధోక్తిలో విషాదముతో) అహో స్వరసాదృశ్యము! ప్రతిమాస్థులగు మహారాజులుంగారు మాటాడుచున్నారా యనుకొంటిని.

భర—ఇఁక మాయమ్మగారల కిప్పు డెట్టి యవస్థ వచ్చినది!

రాణులు—నాయనా! మా అవస్థ ఇట్లా ఉన్నది! (ముసుఁగులఁ దొలఁగింతురు)

సుమం — అమ్మలారా! దుఃఖ మాఁపుకొనుఁడు.

భర—(సుమంత్రునిఁ జూచి) అమ్మగారలవకుంఠనము తొలఁగించినప్పుడుగూడ మీరు సన్నిధి నుండుటచే ననుమానించుచున్నాఁడను. మీరు, బాబుగారు, సుమంత్రులవారు గారా?

సుమం—నాయనా! అగును. సుమంత్రుఁడనే

ఉ. చెట్టగదన్న! యిట్టు చిర
జీవితదోషములే వెసక్ వెసక్

దట్టుచు నుండఁగాఁ గడుఁ గృ
తఘ్నతకుం గుఱి యాచు నే నిదే
యట్టిన్పపాలకుండు మృతి
నందినపిమ్మటఁగూడ మొండి నై
వట్టిరథంబుఁ బట్టుకొని
వర్తిలుచుంటిని సూతవృత్తిలోన్.

హా! నాయనా! (లేచి) నాయనా! అమ్మగారల
కభివాదనక్రమము నుపదేశింపుఁడు.

సుమంత్రుఁడు—మంచిది. ఈమె నీయన్న
శ్రీరాములవారి జనయిత్రి కౌసల్యాదేవిగారు.

భరతుఁడు—అమ్మా! నిర్దోషుఁడను నమస్క
రించుచున్నాఁడను.

కౌసల్య—నాయనా! నీవు సంతాపపడవద్దు.

భరతుఁడు—(స్వగతము) ఈపలుకు నన్ను
లాగికొనుచున్నది. (ప్రకాశము) అనుగృహీతుఁ
డను. తరువాత—

సుమం—ఈమె, లక్ష్మణులతల్లి, సుమిత్రా
దేవిగారు.

భర—అమ్మా! లక్ష్మణునిచే వంచింపఁబడిన వాఁడను నేను నమస్కరించుచున్నాఁడను.

సుమిత్ర—నాయనా! యశస్సు గడించుకో.

భరతుఁడు—అమ్మా! ఇదిగో! యత్నింతును. అనుగృహీతుఁడను. తర్వాత—

సుమంత్రుఁడు—ఈమె నీతల్లి.

భర—(సరోషముగా లేచి) ఛీ! పాపురాలా!

ఆ. హేయముగను దోఁచె మాయమ్మమాయమ్మ
నడుమ నీవు నిల్వ నాకు నెంతో
కడుఁ బవిత్రము లగు గంగాయమునలకు
నడుమ ముఱికికాల్వ నడచినట్లు.

కైకేయి—నాయనా! నే నేమిచేసినాను?

భర—ఏమి చేసితి నని యడుగుచున్నావా?

సీ. నాచేత దుష్కీర్తి, నాయన్నచే నార
చీరలుంగలు మోవఁజేయలేదా?
మానాయనకు గృహామరణమ్ము, సౌమిత్రి
కడవి నల్లాటమ్ము నిడఁగలేదా?

మమ్ముఁ గూర్మిని బ్రోచునమ్మల నిద్ద్వర
దుఃఖవారాశిలోఁ ద్రోయలేదొ?
కన్నీరు మున్నీరుగా నయోధ్య న దెల్లఁ
జెల్లఁబో యని కుందఁజేయలేదొ?
పేరడవిపట్టులందుఁ బువ్వారుఁబోఁడిఁ
గోడలిని సంకటంబులఁ గుడుపలేదొ?
యెంత దుశ్చింతురా లని యెల్లజగము
రోయురోఁతకు నిన్నుఁ దార్చుకొన లేదొ?

కౌసల్య—నాయనా! పెద్దలమర్యాద లన్నీ పాటించేవాడవు నీవు మ్రొక్కవేమి మాయమ్మకు?

భర—మాయమ్మయందువా? అమ్మా! నీవే నా కమ్మవు. అమ్మా! నమస్కరించుచున్నాఁడను.

కౌస—కాదు కాదు నాయనా! ఈమె నీతల్లి.

భర—తల్లియే మునుపు. ఇప్పుడు గాదు. చూడు తల్లీ!

శా. పాపాత్ముం డగు నేనిఁ బుత్త్రికుఁ గృపా
బంధంబు సంధింప కే
త్రోపాడం దగుఁగాదె తండ్రులు; కపు
త్త్రిం డౌఁగదే వాఁడు; నే

స్థాపింతుఁ భువిఁ గ్రొత్తధర్మమును భ
ర్తఁ జిక్కులఁ ద్రొక్కుచుం
బాపంపుంబడి నేఁగుమాత కిఁకపై
మాతృత్వముఁ దీఱుతన్.

కైకేయి—నాయనా! మహారాజులుంగారి సత్యవచనము రక్షించడముకోసము నే నాలా గడిగినాను!

భరతుఁడు—ఏ మడిగితివి? ఏ మడిగితివి?

కైకేయి—నాకొడుకు రాజుగావలె నని అడిగినాను.

భరతుఁడు—అట్టులా! నీకు నాయార్యుఁడు మాత్ర మే మగు ననుకొంటివి?

గీ. ఔరసుఁడుగాఁడో మాతండ్రికతఁడు, మఱియు
నతనియభిషేక మక్రమ మయిన దగునో
ఆనుకూల్యంబు లేదో మా కన్నదమ్ము
లకుఁ? బ్రియంపడరో మఱి ప్రకృతిజనులు?

కైకేయి—నాయనా! అనుమతించినశుల్కము నడుగుకొనవలెగదా నేను?

భరతుఁడు—

గీ. రాజ్యమును వీడి నారచీరలు ధరించి
పాదచారి వై యడవికి భార్యతోడ
వెడలు మని యార్యునకు నాన వెట్టితివట
శుల్కమున నిత్తెఱఁగుగూడఁ బల్కఁబడెనె?

కైకేయి—నాయనా! చెప్పఁదగినచోట, చెప్పఁదగినప్పుడు చెప్పుతాను.

భరతుఁడు—

ఉ. దుర్యశమందు వాంఛ గల
దో? మముఁ బేర్కొన నేల? రాజ్యధూర్
ధుర్యతఁ గాంచుకోర్కి గల
దో దయ సేయఁడె తేఁడు? భూమిభృ
ద్వర్యునిమాత యన్న గరు
వంబు వహింపఁ దలంపు గల్గెనో?
యార్యుఁడు గాఁడొకో కొమరుఁ
డమ్మరొ నీకు యథార్థ మాడుమా!
అయ్యో! ఎంతపని చేసితివే!

ఉ. సీ లల! రాజ్యలోభమునఁ
జేసి హరించితి తేని ప్రాణముల్

ప్రోలు దొలంగఁ ద్రోచితివి
పొమ్మని కావల కగ్రపుత్త్రునిన్
వ్రీలవు నారచీరలు ధ
రించినజానకిఁ జూచికూడ గుం
డ్రాల నొసర్చె నేమొ విధి
రట్టడిబండలు నీదుగుండియల్ !

సుమంత్రుఁడు—బాబూ! వీరుగో వసిష్ఠ వామదేవులు ప్రకృతులతో నరుదెంచి మీ యభిషేకమును బురస్కరించుకొని యిట్లు విజ్ఞాపించుకొనుచున్నారు.

గీ. గోపకులకాఁపు లేకున్న గోగణంబు
ప్రోపుమాలి నాశనమును బొందునట్లు
భూపతుల ప్రాపు లేకున్న భూమి ప్రజలు
ప్రోపుమాలి వినాశంబుఁ బొందఁగలరు.

భరతుఁడు—ప్రకృతులు నన్ను వెంటాడుదురు గాక !

సుమంత్రుఁడు—అభిషేకమును విడిచి నీ వెక్కడికి వెళ్లెదవు ?

భరతుఁడు—అభిషేకమా? ఇదిగో అమ్మ
గారికిఁ జేయుఁడు.

సుమంత్రుఁడు—నీ వెక్కడికి వెళ్ళెదవు?

భరతుఁడు—

ఆ. ఉండె లక్ష్మణప్రియుం డెందు, నందుల
కరుగువాఁడ నేను; నమ్మహాత్ముఁ
డుండకుండెనే నయోధ్య యయోధ్య కా
దెం దతండు గలఁడ దే యయోధ్య.

[అందఱు నిష్క్రమించిరి.]

ఇది తృతీయాంకము

ప్రతిమానాటకము

చతుర్థాంకము

[అంతఁ జేటికలు ప్రవేశింతురు]

విజయ—ఓసీ! నందినికా! చెప్పు - చెప్పు ఇప్పుడు కౌసల్యమ్మగారు మొదలుగా జనానావారంతా ప్రతిమాగృహాము చూడబోతేగాదూ బాబులు భరతులుగారక్కడ తారసిల్లినది? దురదృష్టవంతురాలిని నే నప్పుడు వాకిలిదగ్గిర ఉన్నాను.

నందినిక—ఓసీ! మే మంతా ముచ్చటగా చూచినాము బాబులు భరతులుగారిని.

విజయ—కైకమ్మగారిని బాబులు ఏమన్నారే?

నందినిక—అనడమూ లేదు ఏమీలేదు. బాబులు ఆవిడగారిని చూడడానికికూడా సమ్మతించలేదు.

విజయ—ఎబ్బే! ఎంతకష్టము. రాజ్యపాశ పెట్టుకొని బాబులు (శ్రీ)రాములుగారికి పట్టము చెడగొట్టబోయి దానితో తనకు వెధవరికము కూడా తెచ్చుకొన్నది; లోకానికీ కీడు తెచ్చినది. దయాదాక్షిణ్యాలు లే వామెగారికి; కసుమాలపు పని చేసింది.

నందినిక—ఓసీ! విను: ప్రకృతులు తెచ్చిన అభిషేకమును పారవిడిచి రామబాబు లున్న తపోవనానికే వెళ్లినారు భరత బాబులు.

విజయ—(సవిషాదముగా) ఆఁ! బాబులు వెళ్లిపోయినారా? నందినికా! రా! కైకమ్మగారిని చూదాము. (వెళ్లిరి.)

[ఇది ప్రవేశకము]

[అంత భరతుఁడు రథముతో సుమంత్రుఁడును, సూతుఁడును వత్తురు.]

భరతుఁడు—

ఉ. చేరె దివంబు తేఁడు తన
చేసినపున్నెము వెన్నడింపఁగాఁ;

భరతుఁడు—(రథముననుండి దిగి) సూత గుఱ్ఱములను విడిగా విశ్రమింపఁజేయుము.

సూతుఁడు—బాబుల సెలవు ప్రకారము.

(వెడలున

భరతుఁడు—ఓనాయన! విన్నవింపుము విన్నవింపుము!

సుమం—కుమార! ఏమని విన్నవింతును

భరతుఁడు—'రాజ్యలుబ్ధ యగు కైకేయి గొడుకు భరతుఁడు వచ్చె' నని.

సుమంత్రుఁడు—కుమార! ఊడుగుము. గు జనాపవాదము నుగ్గడింపరాదు.

భరతుఁడు—మంచిది. పరదోషము ను డించుట న్యాయ్యము గాదు. కనుక నిట్లు చెప్పుఁడ 'ఇక్ష్వాకుకులకళంకభూతుఁడగు భరతుఁడు వచ్చె నని.

సుమం—కుమార! నే నిట్లు చెప్పఁజాలన షుఁ...యేమ్మన, 'భరతుఁడు వచ్చె' నని చెప్పెదున

భరతుఁడు——వలదు, వలదు. పేరుమాత్రము పేర్కొనుట నాకుఁ బ్రాయశ్చిత్తము జరగని తెలుఁగుగాఁ దోఁచుచున్నది. బ్రహ్మహత్యఁ జేసిన వాండ్రకుఁగూడఁ బరులచే నివేదము లేదు గదా! కనుక మీరు నిలుఁడు. నేనే విన్నవించుకొందును. ఓహోయి! విన్నవింపుఁడు, విన్నవింపుఁడు, పూజ్యుఁడును, పితృవాక్యపాలకుఁడును నగు రామచంద్రమూర్తికి!

ఆ. జాలిలేనివాఁడు, మేలు మఱచువాఁడు,
పామరుండు, మోటుపనులవాఁడు
ఐన భక్తిమంతుఁ డరుదెంచె నొక్కండు
నిలువ సెలవా? లేక తొలఁగ సెలవా?

(అంత రాముఁడు సీతాలక్ష్మణులతోఁ బ్రవేశించును.)

రాముఁడు——(విని సహర్షముగా) సౌమిత్రీ! వింటివా? ఓసి, విదేహరాజకుమారీ! నీవును వింటివా?

మ. ఉఱుముక్ క్రమింగిన దీస్వరం బెవరిదో
కో యయోధ్యాధుర్ ? మత్పిత్రు

స్వరముఁ బోలి వినంబడెన్; మదికి నా
శ్వాసంబు, సౌహార్దముల్
బరితోషంబును సంతరించె; మఱియున్
బంధుత్వసందేహముల్
నెఱయించెన్; బెరయించె వీనుగవకున్
నెయ్యంబు తియ్యం బహో!

లక్ష్మ—ఆర్య! నాకును నీపలుకు నవ్వాడి బంధుజనబహుమానమును బుట్టించుచున్నది సుమా!

ఈస్వరము—

ఉ. బింకము గల్గి, స్పష్ట మయి,
పెద్దది యై, కల మై, మహోత్సవుల్
ఆంకెయుఁబోలె స్నిగ్ధమధు
రం బయి, కంఠమునం దురంబునన్
జంకని దై, స్ఫుటాంగముల
స్థానము లంటినయక్షరంబులన్
బొంకము గాంచి, వర్ణములఁ
బ్రోవఁగఁజాలినదో యనం దగెన్.

రాము—ఈపలుకుతీరు బాంధవునిదే యనుటకు సందేహము లేదు. సాహ్వాదయమును గలఁచి

వెచుచున్నట్టున్నది. వత్స, లక్ష్మణా, చూడు మోయి!

లక్ష్మ—ఆర్యుని సెలవుప్రకారము.(కదలును)

భరతుండు—అన్నా! ఏమి! ఎవరును బదులు పలుకకున్నాడు? కైకేయీపుత్త్రుఁడగు భరతుఁడు వచ్చె నని తెలిసికొనిరా యేమి?

లక్ష్మ—(చూచి) అరే! ఈయన! అన్న! రామచంద్రమూర్తి! కాదు, కాదు; అన్నపోలిక!

ఉ. అన్న మొగంబుఁబోలెఁ జెలు
వారు మొగంబు శశాంకహృద్యమై
పెన్నురముం సురారిశర
పీడితవక్షా నృపుజోమ్ముపోల్కి నొ
ప్పన్నెఱకాంతిపుంజమునఁ
బొల్చు జగత్ప్రియ దర్శనుండుగా
నిన్నరనాథుఁ డారయ మ
హేంద్రుఁడొకో, మధుసూదనుండొకో!

(సుమంత్రునిఁ జూచి) ఓహో! నాయన!

సుమం—ఓహో! బాబు లక్ష్మణుఁడు!